
# ఘోరతంమిట్ట



"కాలిపాయ!... కాలిపాయ!... అయ్యయ్యో కాలిపాయ!"

అరుపులు ... హాహాకారాలు... ఉరుకులు పరుగులు. ముసలీ ముతకా...పెద్దా చిన్నా అందరూ అరుస్తున్నారు. అరుస్తూ అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. చేతికందిన ముంతా మూకుడూ... కుండా చట్టీ.. బకెట్టూ బాన- ఏది చేతికి దొరికితే అది. గబగబ నీళ్ళు ముంచుకొంటున్నారు. 'కాలిపాయ!... కాలిపాయ!... అయ్యయ్యో కాలిపాయ!' అని అరుస్తూ పరుగెత్తుతున్నారు. ఆ ఒక్క ఊళ్ళో జనమే కాదు- కూతదవ్వులో మూడూళ్ళు. ఆ మూడూళ్ళ జనం గుంపులు గుంపులుగా అరుస్తూ.... హాహాకారాలు చేస్తూ!...

దాదాపు అర్ధరాత్రి కావస్తూ ఉంది. ఊరి ముందర గుంటకట్టమీద వారధి... ఆ వారధి మీద కూర్చొని వెంకటరెడ్డితో మాట్లాడుతూ ఉన్నాను అంతకుమునుపే. అర్ధగంట కూడా అయిందో లేదో వచ్చి పడకమీద అలా వాలాను. మాగన్నుగా నిద్రపట్టింది. ఆ కలత నిద్రలో కలగనుతున్నట్లు... ఆ భయానక దృశ్యం కనుల ముందు చిత్రంగా మెదులుతున్నట్లు!...

ఉలిక్కిపడి లేచాను.

కలగాదు. వాస్తవమే. ఆ ఊళ్ళో ప్రతి వ్యక్తీ వయసుతో నిమిత్తం లేకుండా చేతికి దొరికిన పాత్రతో నీళ్ళు ముంచుకొని పరుగులు తీస్తున్నారు. నిద్ర మత్తు పారిపోయింది. ఒక్క ఊపులో పైకి లేచాను. జారిపోతున్న నాలుగు మూర్ల తుండును మొలకు చుట్టుకొంటూ గబగబ వీధి వాకిట్లోకి వచ్చి నిలబడ్డాను. ఊరంతా కలయచూశాను. ఎక్కడా ఏదీ కాలుతున్నట్లు కనిపించలేదు.

ఎక్కడ కాలుతున్నట్లు?.. ఏది కాలుతున్నట్లు?... ఎందుకీ పరుగులు?.. ఎక్కడికీ పరుగులు? ఎవరిని అడగడం? ఎవడి తొందర వాడిది. ఎవడి ఆదుర్దా వాడిదిగా ఉంది. అడిగినా నిలబడి సమాధానం చెప్తారన్న నమ్మకం కుదరడంలేదు. అందుకే పరుగు నడగ్గా ఊరిముందర బాటమీదికి చేరుకొన్నాను. అక్కడ నిలబడి దిక్కులు చూస్తే-

ఊరికి వాయవ్యదిశగా భారతం మిట్టమీద మంటలు! భగభగ మంటలు!...భుగభుగ పొగలు గక్కుతూ...కాలనాగు నాల్కలు సాచుతున్నట్లుగా... ఆకాశాన్నే అందుకోవాలన్న అతిశయంతో లేస్తున్నాయి మంటలు. అగ్గికి గాలి తోడయింది. పైకి లేస్తున్న మంటలు పూనకం పూనిన మనిషి ఊగినట్లు ఊగుతూ ప్రళయతాండవం చేస్తున్నాయి.

ఎగూరు... దిగూరు... మిద్దూరు- మూడూళ్ళ జనం వరసగట్టారు. ఊరి ముందర గుంటలో నీళ్ళు కడవల్లో చేతులమీదుగా పోతున్నాయి. కుండపోతగా మంటలమీద పడుతున్నాయి. ప్రతి ఇంట్లో ఉన్న నీళ్ళు పరుగుల మీద వచ్చి ఆ మంటలమీద పడుతున్నాయి. ఎవడో అన్నట్లుగా ఉడుత ఊగిస్తే మాను కదులుతుందా?

అయినా... మనిషి ఆశాజీవి. ఆ మంటలతో హోరాహోరీగా పోరాడుతున్నాడు. ఊరికి ఎగుదల బొంతవాని బండకు దిగుదల బొంతివంకకు వెళ్ళే బండిబాట పక్కన భారతం మిట్ట. నాలుగైదు దశాబ్దాల కిందట ఆ పాయకట్లో పదిపన్నెండు గ్రామాలు చేతులు కలిపి అహోరాత్రాలు శ్రమించి అయిదెకరాల విస్తీర్ణంలో అందంగా కట్టుకొన్న ఇరవై అంకణాల కొటాయి. మూడు అంకణాల ఉగ్రాణం. అయిదు అంకణాల ఆటగాళ్ళ ఇల్లు. అన్నీ పూరికప్పుతోనే. అయితే మాత్రం? పల్లె పల్లెకు అయిదారు బండ్ల బోదకసువు దామాషాగా తెచ్చి కప్పిన కప్పు. ఎంత అందంగా ఉండేదో?

పూరికొంపలే కావచ్చు. కానీ, అవి ఆ పల్లెవాసుల శ్రమఫలితాలు. ఒక విధంగా చెప్పాలంటే- అవి వాళ్ళకు ఆనందనిలయాలు! కండ్ల ముందరే కాలిపోతున్నాయి- గుండె గుండెను కాలుస్తూ.

ఒక్క క్షణం కాలు నిలబడలేదు. పరుగందుకొన్నాను. ఒక కిలోమీటర్‌కు పైబడిన దూరం ఎలా పరుగెత్తానో నాకే తెలియదు. భారతంమిట్ట మీద నిలబడ్డాను గసపోసుకొంటూ.

మంటలు!...ఎండకు బాగా ఎండిన బోదకసువు మంటలు భూమ్యాకాశాలను ఏకం చేస్తున్నట్లుగా భగభగ మంటలు. ఫెళఫెళమంటూ వెదుర్లు పగులుతున్నాయి. గాలి తిప్పించి

మల్లించి కొడ్తూ ఉంది. బోదకసువు మంటలు తెట్టెలు తెట్టెలుగా లేచి గాలి వాటంగా పోయి పడుతున్నాయి. దూలాలు వెనుగాడి కొయ్యలు కాలి విరిగి పడుతూ ఉంటే, ఒక్క పక్క కప్పు కుప్పలుకు కుప్పలుగా నేలకు కూలుతూ ఉంది. మూడూళ్ళ జనం అలుపూ సొలుపూ ఎరగకుండా ఆ మంటలను ఆర్పడానికి శాయశక్తులా పోరాడుతూనే ఉన్నారు. అయినా, ఇరవై అంకణాల బోదకప్పు కొటాయికి నాలుగు వైపులా ఒకే సారిగా నిప్పంటు కుంటే, కడవలలో నీళ్ళు ఏ మూలకు?

పదేండ్లయినా దాటని పసిగుడ్లు. ఆవేళప్పుడు హాయిగా ఆదమరచి నిద్రపోవలసినవాళ్ళు. పాలుగారే అరిచేతులు. ఆ అరిచేతులను చేర్చి దోసిళ్ళకందిన మట్టిని జవురుకొని మంటలమీద చల్లుతున్నారు ఉడతాభక్తి. ఉడతకు దక్కిన పేరుగూడా ఈ పసిగుడ్డులకు దక్కేటట్లుగా లేదు. గుండె ద్రవించింది. రెండు కన్నీటిబొట్లు!... ప్రయోజనం?

దాదాపు మూడు నాలుగు గంటలసేపు! కాలు కదల్చకుండా చూపు మరల్చకుండా ఆ బీభత్సానికి సాక్షిగా నిలబడ్డాను అంతకంటే ఏమీ చేయలేక. మూడూళ్ళ జనం హోరాహోరీ పోరాట ఫలితంగా కాలింది కాలిపోగా ప్రయత్నించి తడిపింది కాలకపోగా ఆ కొటాయి కాలీకాలకుండా నిలబడిన అస్థిపంజరాన్ని తలపింపచేస్తూ ఉంది. ఈ లోపుగా ఉగ్రాణం ఆటగాళ్ళ ఇల్లు కాలి బూడిదకాగా మొండిగోడలు మాత్రం మసిబారి వికృతంగా వెక్కిరిస్తున్నాయి.

ఏ మొగంలో చూసినా కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. నోట మాట పెగలడంలేదు. పడిన శ్రమ అంతా వృథా అయిందన్న ఆవేదన. అలిసిసొలిసిన గుండెలను అరిచేతుల్లో పట్టుకొని ముందుకు పోలేక అక్కడే నిలబడలేక భారతంమిట్ట వైపు తిరిగి తిరిగి చూస్తూ, నిట్టూరుస్తూ జీవచ్ఛవాల్లా కదులుతున్నారు. భారతంమిట్ట చూస్తూ చూస్తూ ఉండగానే కాలి బూడిదయింది. ఆ బూడిద కుప్పలను చూస్తూ ఉంటే మనసు ఎప్పుడు పోయిందో గతంతో ముచ్చట్లాడుతూ ఉంది.

ఊళ్ళో భారతం అంటే అది ఆడవాళ్ళకుకానీ, మగవాళ్ళకుకానీ కంటిమీద రెప్పపడేది కాదు. ఒంటి మీద గుడ్డ నిలవదు. ప్రతి ఇంటా ఒక శుభకార్యం జరుగుతూ ఉంటే కూడా అంత హుషారు ఉండదేమో? ఎందుకంటే, అప్పట్లో వాళ్ళకు ఇప్పటి మాదిరి సినిమాలు, వినోద కార్యక్రమాలు ఏమీ లేవు. అందుకే ఏడాదికి ఒకసారి ఆ పాయకట్లో ఉన్న పల్లెలన్నీ చేతులు కలుపుతాయి. భారతం జరిపించి అదే ఒక భాగ్యంగా భావిస్తాయి.

నాకు ఇంకా బాగా గుర్తు- నాఈడు పిలకాయలంతా చేరి తోటి కంగాణిగాడి వెంట పడడం! వాడు తుడుం చేతపట్టి ఊరూరు తిరుగుతూ, 'ఫలానా దినం భారతం కొడి ఎక్కుతుందాహో!' అని దండోరా వేస్తుంటే, మా కంటికి వాడొక అవతార పురుషుడుగా కనిపించే వాడు. వాడేదో మాకొక వరం ప్రసాదించినట్లు ఎగిరెగిరి గంతులు వేసేవాళ్ళం.

అవును! భారతంమిట్ట అంటే ఆ పల్లెజీవుల సాత్త్విక వినోదాలకు ఆటపట్టు. ఏటేటా ఆ శ్రమ జీవులు పద్దెనిమిది దినాలు పండుగలు చేసుకొనేది ఆ మిట్ట మీదనే. వాళ్ళ పాలిటికి అదొక పుణ్యభూమి.

ఆ పుణ్యభూమిలోనే కదా తిరువేంగడంపిళ్ళ దినానికొక్క పర్వంగా పద్దెనిమిది దినాలు భారతాన్ని పండిత పామరజన రంజకంగా పగటి కథగా చెప్పేది! పండు ఒలిచి అరిచేతిలో పెట్టినట్లుగా ఆయన కథ చెప్తూ ఉంటే, ఆ కొటాయిలో కూర్చొనే కదా ఆ పాయకట్లో ప్రజలందరూ పరవశించి వినింది? ఆయన పగటి కథగా చెప్తే కంగుందికుప్పంవాళ్ళు రాత్రిపూట వీధి నాటకంగా ఆడి చూపించింది ఆ మిట్ట మీదనే కదా? అర్జునుడు తపస్సు మాను ఎక్కినప్పుడు... ఉత్తర గోగ్రహణంలో ఆవులను మళ్ళించినప్పుడు... బకాసురుడికి బండ్ల మీద కుంభం కూడు తోలినప్పుడు... కడపటి దినం అగ్ని ప్రవేశం చేసినప్పుడు ఇసుక వేస్తే రాలనంత జనం విరగబడి చూసి ఆనందించింది ఆ మిట్టమీదనే కదా? చలివేందరాలు పెట్టింది... సంతర్పణలు జరిగింది కూడా ఆ మిట్టమీదనే కదా? కడకు తప్పి దారీ ఎవడైనా తాగేసివస్తే నిలబెట్టి తప్పు కట్టించింది కూడా ఆ మిట్ట మీదనే కదా?

గత స్మృతులతో మనసు వికలమయింది. మసిబారి దిసమొలతో నిలబడినట్లున్న మొండిగోడలను, వికృతంగా మారిపోయిన కొటాయిని చూస్తూ ఉంటే కడుపులో చెయ్యేసి దేవినట్లుంది. అక్కడ నిలబడలేక వెనక్కు తిరిగాను. అడుగు మీద అడుగ్గా నడుస్తున్నాను. ఆ రాత్రే తొలిజాముల్లో గుంటకట్టమీద వారధి పైన కూర్చొని వెంకటరెడ్డి అన్న మాటలు యథాతథంగా గుర్తుకొస్తున్నాయి.

"అన్నా! ఈ మట్టిమిందనే పుట్టినాము. ఈ మట్టిలోనే ఆడుకున్నాము. ఈ మట్టిమిందనే పెరిగినాము. ఈ మట్టినే బువ్వగా మార్చాలని పోరకలాడినాము. ఈ పోరాటం ఆరాటం నాకు బుద్ధి తెలిసినప్పటినుంచి యాభై ఏండ్లు నెత్తిమింది కొచ్చేదాకా కొనసాగింది. ఇంక ఎటువంటి పరిస్థితిలో గూడా సాగదన్నా!"

"ఎందుకు సాగదురా!"

"మట్టితో పోరాడే మనిషి సాటి మనిషితో పోరాటానికే దిగినాడే?"

"ఆ పరిస్థితి ఎందుకు కలిగింది?"

"ఎందుకు కలిగిందంటే, కలగచేసుకుంటే కలిగింది."

"దేనికైనా ఒక కారణం ఉండి తీరాలిగదా?"

"కారణమా పాడా? ఉత్తుత్త పుణ్యానికే!"

"నువ్వు చెప్పేది మరీ విపరీతంగా ఉందే? ఉత్తుత్త పుణ్యానికే వాళ్ళు కత్తులు, కటార్లు ఎత్తుకుంటారంటే వేరే పనీపాటా ఏమీ లేదా వాళ్ళకు?"

ఆమాటతో భారంగా నిట్టూర్చాడు వెంకటరెడ్డి. ఆతరువాత-

"పనీపాటా ఎందుకు లేదు? ఉండాదనుకో. ఉణ్ణా చేసే నీకాడుకెవుడు? గిచ్చి జగడాలకు పిల్చేది. కత్తులెత్తుకుండేది. పోలీస్ స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగేది."

"అయితే, బతుకు లెలా గడుస్తున్నాయ్?"

"బతుకులకేమన్నా? బ్రహ్మాండంగా గడిచిపోతున్నాయి!"

"అంటే మంత్రాలకు చింతకాయలు రాల్తున్నాయా?"

"కాదు. దుడ్లే రాల్తా ఉండాయి. అన్నా! రైతు తిండిగింజలు కొనింది నువ్వు ఎప్పుడైనా విన్నావా!"

"లేదు"

"ఇప్పుడు రైతు తిండిగింజలు కొంటున్నాడు. దుడ్లు పుష్కలంగా చేతికొచ్చే పంటల వైపే మొగ్గు చూపుతున్నాడు. ఆ దుడ్లతో ఆడతా ఉండాడు చూడు ఆట! తలకాయి దమ్మిడికి అడగటా ఉండాడు."

"ఈ మార్పుకు కారణం ఎమంటావురా?"

"ఏమని చెప్పమంటాఁవన్నా? ఒంటికి సెగదగలకుండా చేతినిండికి దుడ్లు. వాటి పాపం గూల! ఆ దుడ్లు ఊరికే ఉండాలన్నా ఉండనిస్తాయా! కోడికి కత్తిగట్టి ఎగరద్దంటే అది ఊరికే ఉంటిందా? అట్లయిపాయగదన్నా యవ్వారం. లేకుండాబోతే ఊరికొక చెరువు. ఆ చెరువులో నీళ్ళు. చెరువు కింద మడికయ్యలు. ఆ కయ్యలకు చెరువు నీళ్ళు వంతుల పకారం పారకట్టుకోవాలనే ఒప్పందం కుదుర్చుకున్నారు. దాన్ని కాదని 'వంతులేంది? నువ్వు ముందేంది? నేను వెనకేంది? అంటా ఒకడు అడ్డం దూరె. ఇంకొకడు కాదనె. ఒకడు ఔనంటే ఇంకొకడు కాదనే వాదులాట చెరువు తూఁవు పూడ్చేసేకాడికి ఎగబడె. నీళ్ళు నీకూ వద్దు నాకూ వద్దు. తూఁవు పూడ్చేస్తానని ఒకడు ఎగబడ్తే, ఇంకొకడు 'అదెట్లా పూడస్తావో పూడ్చు చూద్దాం!' అంటూ తిరగబడె. తిరగబడేదంటే ఏందన్నా? కత్తులు, కటార్లతో కలబడే దేగదా? తలకాయిలు పగిలె. ఇంకేం ఉండాది? చేతిలో చిలుం వదిలి పొయ్యేదాకా పోలీస్ స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టు తిరగతా ఉండారు. మనుషుల్లో ఈ మార్పు ఎట్లా వచ్చింది? ఎందుకొచ్చిందంటే నన్నేమని చెప్పమంటావన్నా? ఊళ్ళో ప్రతిఒక్కడూ ఒకనాయకుడై పోవాలని రాజకీయం నడిపిస్తా ఉంటే!"

నా మనసు పరిపరివిధాల పోతూ ఉంది.

చుట్టూ పెట్టని కోటగోడల్లా కొండలు... ఆ కొండల్లో ఏపుగా పెరిగిన చెట్టూ చేమలు... ఆ చెట్టూ చేమల్లోని పచ్చదనమంతా కరిగి ప్రవహిస్తే పుడమితల్లి పులకరించినట్లుగా పచ్చని పొలాలు...ఆ పొలాల్లో మట్టిని బువ్వగా మార్చడానికి రైతన్నల ప్రయత్నాలు... ఆ ప్రయత్నాలతో ప్రయాస... ఆ ప్రయాసను మరిచిపోవడానికి పదాలు!... ఏలపదాలు!!!...

అవి నినాదాలు కావు. మైమరపించే వేణునాదాలు.

అదొక వెర్రిలోకం! కుళ్ళూ కుత్సితాలు...కక్షలు కార్పణ్యాలు... మోసాలు ద్వేషాలు... పగలు పట్టింపులుతెలియని ఒక అమాయక లోకం. ఆ లోకాన్నంతా కలిపితే ఒక పది పన్నెండు పల్లెలు. పల్లెపల్లెకు ముచ్చటగా ముప్పై నలభై గడపలు. ఆ గడపలు ఆత్మీయతలకు అనురాగాలకు ఆనవాళ్ళు...మంచికి నకళ్ళు!!

ఆ గడపల్లోకి నిర్భయంగా ఇప్పుడు కార్పణ్యాలు!... కత్తులు! అప్పటికి ఇప్పటికి ఎంత తేడా?

ఆనాటి మనుషులు చదువుసంధ్యలు లేని మొరటుగాళ్ళే కావచ్చు. మూఢనమ్మకాలకు మూలపురుషులే కావచ్చు. కానీ, తాత్త్విక చింతనలకు సంఘీభావాలకు నిర్మాణాత్మకమైన పనులకు నిదర్శనాలు. అది జాతరో యాత్రో భారతమో- ఏదైనా కావచ్చు. కలపడానికి అదొక కారణం. కలుసుకొన్నప్పుడు అవగాహన. ఆ అవగాహనతో ఐకమత్యం. ఆ ఐకమత్యంతోనే అనుకొన్న పనులు సాధించుకోవడం!

అదేగదా భారతంమిట్ట!

ఆ భారతంమిట్ట నేడు ఏమయింది? కాలి బూడిదయింది. కారణం ఏమంటే? ఇది రాజకీయం ఆడిస్తున్న చదరంగమన్నా! అంటాడు వెంకటరెడ్డి. అయితే చదరంగంలో నష్టపోతున్నది ఎవరు? లబ్ధి పొందుతున్నది ఎవరు? అన్న ఆలోచనకూడా లేకుండా ఇంత అజ్ఞానం చోటు చేసుకొనిందా ఈ పల్లె కదుపుల్లో? అని ఆలోచించుకొంటూ వచ్చి గుంట కట్టమీద వారధిపైన కూర్చున్నాను.

మలికోడి కూసే వేళయినట్లుంది. రైతులు పనీపాటకు బయలుదేరే వేళ. అయితే- ఊరు అప్పుడు సద్దుమణగినట్లుంది.

పుట్టిందీ, బాల్యం గడిచిందీ ఆ పల్లెల్లోనే. తర్వాత చదువు పేరుతో మకాం పక్కనున్న పట్టణానికి. అర్ధాంతరంగా ఆగిపోయిన చదువుతో ఉద్యోగ ధర్మంగా ఊళ్ళు పట్టుకొని తిరిగినా మరలా తలచుట్టి నోటివద్దకే వచ్చినట్లుగా చేరింది- ఆ పట్టణంలోనే. తొట్టి మరులు వదలలేదు. చూసిపోదామని చుట్టపుచూపుగా పల్లెకు వస్తే పరిస్థితి దయ్యమై పట్టుకొనింది. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా? ఎప్పుడెప్పుడు బస్సెక్కుదామా? అని మనసు తొందరపడుతూ ఉంది.

"చూస్తున్నావ్ గదన్నా! ఇదీ వరస. ఇంక నన్నేం చెయ్యమంటావ్?"

నా ఆలోచనల్లో నేనుంటే ఎప్పుడు వచ్చి కూర్చున్నాడో వచ్చి పక్కన కూర్చున్నాడు వెంకటరెడ్డి. ఒంటి మీద చొక్కా లేదు. మొలగుడ్డ కాలి అక్కడక్కడ చిరుగులు పడింది . ఒళ్ళంతా మసిబారింది. ఆ మసితో కలిసి చెమటలు. తల బూడిద గుమ్మడిని తలపింపచేస్తూ ఉంది. మనిషి బాగా అలిసిపోయాడు.

"అదిగాదు వెంకటరెడ్డీ! ఇదేదో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదమైతే అది ఏ కొటాయికో లేదా ఉగ్రాణానికో లేదా ఆటగాళ్ళ ఇంటికో పరిమితమై ఉండేది. అలా కాకుండా మూడిండ్లూ ఒకేసారిగా తగలబడ్డాయంటే?... అదిగూడా ప్రతి ఇల్లు నాలుగువైపుల నుండి నిప్పంటుకొనిందంటే?...ఇది అగ్ని ప్రమాదం అనడానికి ఎలా వీలవుతుంది?"

"అగ్ని ప్రమాదమని ఎవరన్నారన్నా? కక్షలూ కార్పణ్యాలతో అగ్గిపెట్టుకుంటే?"

"కక్షలూ కార్పణ్యాలుంటే దానికి భారతంమిట్టే లక్ష్యం కావాల్సిన అవసరం ఎక్కడుంది?"

"అన్నా! హనుమంతుడి తాత ధర్మయ్య గదా? నీకు తెలియనిది ఏముండాది? నిజంగా ధర్మాత్ముడే గదా? వడ్డీవ్యాపారం చేస్తేమాత్రం చల్లని పూట తల్చుకోవాలి. ధర్మవడ్డే గదా?

ఆకాలాన చావుకో దివసానికో పెండ్లికో పేరంటానికో ఈ పాయకట్లో ఆయన గడప తొక్కని వాడెవుడు? గడప తొక్కి చెయ్యి కడగకుండా వచ్చిందెవుడు? సత్రం కట్టించె. చలివేంద్రాలు పెట్టించె. భారతం జరుపు కోవాలంటే అయిదెకరాల చేను ఉచితంగానే ఇచ్చె."

"చేను అన్నావే కానీ, ఆ కాలాన అదునుకు పదును పడ్తే బంగారు పండుతూ ఉండెగదా? అది సరే! ఇది అందరికీ తెలిసిన సంగతేకదా?"

"అవును. ధర్మయ్య ధర్మాత్ముడనిపించుకుంటానే కడతేరిపాయ. కొడుకు ఆయనతో సరితూగలేక పోయినా అబ్బకు తగిన కొడుకే అనిపించుకుండె. వాడి కొడుకు హనుమంతు. వాడికి పుట్టె పుండు. అయిదెకరాల చేను నాది అంటా కూసుండె."

"అదెలా అంటాడు వాడు? వాడి తాత ఇచ్చిన మాన్యం నలభై యాభై ఏండ్లుగా పాయకట్టు స్వాధీనంలో ఉంది గదా"

"ఉంది. ఉంటే రాతకోతలెక్కడుండాయి? అదేగదా వాడి వాదన."

"సరే. అది వాడితాతసొత్తు. ఆకారణంగా తనది అనడంలో తప్పు లేదనుకుందాం. ఆ మాటకే భారతంమిట్టకు అగ్గిపెట్టాలని ఎక్కడుంది?"

"ఆ మాటకే ఎవుడన్నా అగ్గిపెట్తాడా?"

"మరి?"

"భారతంమిట్టకు నేనే హక్కుదారుణ్ణి. భారతం జరిపించే హక్కు నాకే ఉండాదనె. అన్నెట్టుగానే నిరుడు భారతం జరిపించె."

"మంచిదేగదా?"

"మంచిదే. అయితే ఒకప్పుడు ఇంటింటికి ఇంతని పంపకం వేసి నానా తిప్పలు పడి ఆ పంపకాన్ని వసూలుచేసి జమ అయిన దుడ్లతో భారతం జరిపిస్తే వాడు భారతం జరిపించి దుడ్లు జమ చేసుకుండె!"

"ఇది వింతల్లో మరీ వింతగా ఉందే? భారతం జరిపించడమంటే ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకొన్న పని కానీ, వాడు దుడ్లు చేసుకున్నాడంటే అదెలా సాధ్యపడింది?"

"ఎందుకు సాధ్యపడదన్నా? క్లబ్బులు పెట్టించె. చీట్లాట ఆడించె. క్లబ్బు డ్యాన్సులు పెట్టించె. లాట్రీలు ఆడించె. సారాయి అంగుళ్ళు పెట్టించె. అన్నిటికీ వేలం పాటే గదా? దుడ్లు రాలమంటే రాలవా? ఆడగదా వుట్టె ముసలం అప్పుడెప్పుడో యాదవ కులానికి పుట్నెట్టు!"

"హూఁ! మన చిన్నతనంలో జరిగింది ఆ నాటి భారతం. ఈ పాయకట్టుకే ఒక ప్రతిష్ఠ. ఒక గౌరవ ప్రదం. జనం ఎంతో భక్తిశ్రద్ధలతో భారతం జరుపుకొనే వాళ్ళు. వాళ్ళ దృష్టిలో అదొక పవిత్ర స్థలం. అటువంటి పవిత్ర స్థలంలో నేటి భారతం ఇన్ని దుర్మార్గాలకు దారి తీసింది. పోనీ! పోలీసులు లేరా?"

"ఎందుకు లేరన్నా? లక్షణంగా ఉన్నారు. తాగి తిని హాయిగా ఉన్నారు. దగ్గరుండి ఇదంతా పకడ్బందీగా జరిపించినారు. వాళ్ళ స్వార్థం వాళ్ళది."

"అయినా, భారతంమిట్టకు అగ్గిపెట్టడమే పరిష్కారం కాదుగదా?"

"ఆ సంగతి నీకు తెలుసు. నాకు తెలుసు. వాళ్ళకు తెలియదే! వాళ్ళకు తెలిసినదంతా హనుమంతు భారతంమిట్టను అడ్డం పెట్టుకొని ఇట్లా పనికిమాలిన పనులు జరిపించి దుడ్లు చేసుకున్నాడనే గదా?"

"ఆ మాట వాడితోనే చెప్పి...."

"చెప్తే వినే రకమైతే ఈ బాధ ఎందుకుంటింది? 'భారతంమిట్ట నాది!' అని వాడంటే, 'చేను నీదైతే కావచ్చు. ఆ చేన్లో వేసిన కొటాయి ఇండ్లు అన్నీ పాయకట్టు కష్టంతో పైకి లేసినవే గదా? అవ్వి పాయకట్టుకే చెందాల గదా?' అని వీళ్ళ వాదన. 'అదేం కాదు. అంతా మా తాత సొత్తే! అన్నీ కట్టించిందీ మా తాతే!' అని వాడి మొండిపట్టు. ఇట్లా వాదులాడి కీచులాడి 'నువ్వెట్లా భారతం జరిపిస్తావో చూస్తాం!' అంటా వీళ్ళు పంతానికి దిగితే, 'మీ వల్ల అయ్యింది మీరు చేసుకోండి చూద్దాం!' అంటా వాడు ఎదురుతిరిగె."

"ఆ వెధవకు పదిమందిని కూడగట్టుకోవాలన్న బుద్ధే లేకపోయిందే?"

"ఆ బుద్ధి వాడికి లేకపోయింది. అగ్గి పెట్టడమే పరిష్కారం కాదన్న బుద్ధి వీళ్ళకు లేకపోయింది. ఫలితంగా భారతంమిట్టన బూడిద మిగిలింది."

"హుం! మనస్పర్థలు తగాదాలు విభేదాలు వివాదాలు కక్షలు కార్పణ్యాలు ఈ రోజు కొత్తగా పుట్టుకొచ్చిన వేమీకావు. అనాదిగా ఉన్నవే. అయితే ఒకనాడు వాటిని పరిష్కరించుకొనే ఓర్పూ నేర్పూ గ్రామాల్లో ఉన్నాయి. అది ఎటువంటి సమస్య అయినా రచ్చబండ దగ్గర తెగిపోతూ ఉండింది. అక్కడికీ తెగకుండాపోతే జాతరో భారతమో ఏదో ఒకటి వచ్చేసరికి అన్నీ సర్దుకొనిపోతూ ఉండింది. ముభావంగా అయినా అందరూ మునపడి భారతం మిట్టన కలగలిసి పోయేవాళ్ళు. ఆ రోజుల్లో భారతంమిట్ట కుటుంబాలకు కుటుంబాలకు మధ్య వైషమ్యాలను తొలిగించింది. పల్లెలకు పల్లెలకు మధ్య అభిప్రాయభేదాలను రూపు మాపింది. అందరినీ ఒక తాటిమీద నడిపించింది. ఈ రోజు లేనిపోని వైషమ్యాలతో అభిప్రాయభేదాలతో భారతం మిట్టకే కాదు- ఊళ్ళకే అగ్గి పెట్టింది కదరా?"

"అవునన్నా అవును. ఈ మనస్తత్త్వం భారతం మిట్టకు, ఊళ్ళకే కాదన్నా అగ్గి పెట్టిస్తా ఉండేది- కడాన అబ్బా కొడుకుల మధ్య కూడా అగ్గి పెట్టిస్తా ఉండాది. ఈ పూట నువ్వు వచ్చినావని విధిలేక ఇంట్లో అడుగు పెట్టినాను. అదే వాడు కొంపలో ఉంటే..."

"ఏందిరా నువ్వు మాట్లాడేది?"

"అవునన్నా! మన చిన్నతనంలో మన అయ్యలు ఇంట్లో ఉంటే ఇంట్లో అడుగుపెట్టాలంటే మనం భయపడి చచ్చేవాళ్ళం. ఇప్పుడట్లా కాదు. కొంపల్లో కొడుకులుంటే అబ్బలకు గుండెకాయిలు అరిచేతుల్లో ఉంటాయి."

ఆ రోజు వెంకటరెడ్డి ఇంట్లో సందేహిస్తూ అడుగు పెట్టడం ఎందుకో నాకు అర్థమయింది. నా నోట మాట పెగల్లేదు!

"అన్నా! ఇది ఇంతటితో మంగళం పాడేసే కత అనుకుణ్ణావా? కాదు. ఇది రావణాసురుడి కాష్టం మాదిర రగలతానే ఉంటింది. హనుమంతు భారతం మిట్ట పరువుప్రతిష్ఠ గంగలో కలిపేస్తా దుడ్లు చేసుకుండేది ఊళ్ళోవాళ్ళకు గిట్టక పాయనా? గాంధీరెడ్డిని ముందు బెట్టుకొని మద్దిస్తం జరిపించిరి. అది కుదరకపాయ. 'అయితే, నువ్వు భారతం ఎట్టా జరిపిస్తావో నేనూ చూస్తా' నంటా గాంధీరెడ్డి మీసాలు మెలేసె. ఇదంతా గాంధీరెడ్డి వెనకుండి జరిపించినాడని హనుమంతు అనుమానపడి తీరతాడు. వాడిచేతిలో దుడ్లుండాయి. మనుషులుండారు. రేపు గాంధీరెడ్డి తల వాడు తీయించేస్తాడు. అదే జరిగితే ఊళ్ళోవాళ్ళు ఊరికే ఉండమన్నా ఉంటారా? హనుమంతుణ్ణి లేపేసేదాకా వాళ్ళు నిద్రపోరు. పోనీ, కత ఆడికైనా ఒక ముగింపుకొస్తిందా? అంటే ఇండ్లల్లో వాళ్ళ పెండ్లాలుండ్లా? పసుపూ కుంకం కూడా తియ్యకుండా కూర్చుంటారే?"

ఈ మనస్తత్వం కూడా ఆ పాయకట్టులో ఆడవాళ్ళకు అంటుజాడ్యమే!

కండ్లు మండుతున్నాయి. అంతకుమించి గుండెలు. ఎగబడి రావలసిన బస్సు కోసరం ఎదురుచూస్తూ తూర్పుగా చూశాను,

తూర్పు దిక్కు భారతం మిట్ట తగలబడుతున్నట్లుగా ఉంది.

చిన్నతనంలో నేనూ, వెంకటరెడ్డి గంటల తరబడి ఆ వారధి మీద కూర్చొని భవిష్యత్తును గురించి ఎన్నో కలలు కనేవాళ్ళం. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. కలలు కంటూ ఉండగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసింది. ఇక పల్లెలే పట్టణాలవుతాయని సంబరపడ్డాము. ఆ సంబరం కాలి బూడిద అవుతుందని తెలుసుకోవడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది.

వెంకటరెడ్డి ఎటో చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. ముండ్ల మీద కూర్చున్నట్లుంది నా పరిస్థితి. ఇద్దరి మధ్య మౌనం. ఆ మౌనాన్ని సహించలేనట్లుగా ఎదురుచూస్తున్న ఎర్రబస్సు రానే వచ్చింది. నేను బస్సెక్కాను మండుతున్న మా ఊళ్ళో వెంకటరెడ్డిని విడిచిపెట్టి.

ఎర్రబస్సు వేగాన్ని పుంజుకొంటూ ఉంది. నాలుగు దశాబ్దాల కిందట నేను ఆ బాట మీద నడిచాను. ప్రతినిత్యం కాలికి కాలు కొట్టుకొంటూ నాలుగు నాలుగు ఎనిమిది మైళ్ళు. అప్పుడది మట్టిబాట. ఇప్పుడు బస్సులో ప్రయాణం తారు రోడ్డు మీద. మట్టి బాట నుండి తారు రోడ్డుకు... నడక నుండి బస్సుకు... బస్సు రైళ్ళ నుండి విమానానికి... విమానం నుండి ఉపగ్రహానికి! ఇవి మనిషి తన సౌకర్యాల కోసరం చేసిన ప్రయత్నాల ఫలితం. ఈ ప్రయత్నాల్లో అవసరం కొద్దీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొన్నాడు.

ఈ దిగుమతులు ప్రగతి కోసరం. మానవ కల్యాణం కోసరం!

మరి మా ఊరు దిగుమతి చేసుకొంటున్న మనస్తత్వం?

భారతంమిట్ట కండ్ల ముందు మెదిలింది. వస్త్రాపహరణ నాటకం. దుశ్శాసనుడు ద్రౌపది చీరలను ఒలుస్తున్నాడు. ద్రౌపది హృదయవిదారకంగా విలపిస్తూ అది తగదని వారిస్తూ

మానసంరక్షణ చేయమని శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ ఉంది. శ్రీకృష్ణుడు రాలేదు. దుశ్శాసనుడు తన ప్రయత్నాన్ని మానలేదు. ఈ దృశ్యాన్ని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చారు- ఆ పాయకట్లో వేలాదిజనం!.

ఆ పరిస్థితిలో కూడా చిరునవ్వు నాపెదాల్ని తొంగిచూసి తొలగిపోయింది.

అది నాటకమని తెలుసు. ద్రౌపది వేషం కట్టింది మగవాడని తెలుసు. వాడు పది పన్నెండు చీరలను నాజూగ్గా కట్టుకొని నటిస్తున్నాడని తెలుసు. అయినా, ఒక స్త్రీకి జరగరాని మానభంగం తమ కన్నుల ముందరే జరిగిపోతున్నట్లు కరిగి నీరయిన గుండెలు ఇప్పుడిలా కరుడుగట్టి పోవడానికి కారణం?

నా ఆలోచనలతో నిమిత్తం లేకుండా పోతున్న బస్సు ఉన్నట్లుండి నిలబడింది. నిలబడడం కాదు. ఇరవై ముప్పైమంది యువకులు బాటకుఅడ్డంగా నిలబడి బస్సును నిలబెట్టారు. అందరి చేతుల్లో కర్రలు...నినాదాలు రాసిన అట్టముక్కలు... బస్సు నిలిచీనిలవక ముందే అరుస్తూ... నినాదాలు చేస్తూ చుట్టుముట్టారు.

"రే! చల్లండ్రా పెట్రోల్. పెట్టండిరా అగ్గి. నా కొడుకులు ఎమ్మెల్యేని ఘెరావ్ చేస్తారా?... మా పార్టీ ఎమ్మెల్యే అంటే అంత లేసుగా కనిపిస్తున్నాడా వాళ్ళ కంటికి? అప్పటికి మేమంతా ఏమైపోయ్‌నట్టు? కోకలు కట్టుకోని తిరగతా ఉందారనుకుణ్ణారా? రే! గుడ్డి నా కొడకా! బస్సంతా పడేటట్టు చల్లా పెట్రోల్! అగ్గిపుల్ల గీసి ముట్టిస్తే అర్థ గంటలో బూడిద... బూడిదై పోవాల!"

డ్రైవర్ ఎప్పుడు దూకాడో కిందికి దూకాడు. కండక్టర్ దిగి టికెట్లను, క్యాష్‌బ్యాగ్‌ను దాచిపెట్టుకొంటూ పరుగెత్తుతున్నాడు. ఇక బస్సులో ప్రయాణికులు. నువ్వు ముందా?... నేను ముందా అంటూ తోచులాట... తొక్కులాట...వీళ్ళమధ్య పడి ఆడవాళ్ళ అరుపులు... పసిబిడ్డల ఏడుపులు! బస్సులో గోలగోలగా గందర గోళంగా ఉంది.

"దిగండి!... దిగండి!... ప్రాణాల మీద ఆశలుంటే దిగండి!... దిగి ఈ నిరసన ప్రదర్శనలో మాతో సహకరించండి." అంటూ యువకులు హెచ్చరిస్తున్నారు.

ఒక పక్క భయం... ఒక పక్క ఆవేశం... ఒక పక్క ఏమీ చేయలేని నిస్సహాయత!... అన్నిటికంటే మించి ప్రాణాల మీద తీపి!... ఎవరో వెంటపడి నెట్టుతున్నట్లు ప్రయాణికులు పొలోమని దిగారు.

బస్సు ఖాళీ అయింది.

ఏదో ఘనకార్యం సాధించిన గర్వాతిశయంతో నినాదాలు చేస్తూ అగ్గి పుల్లలు గీసి బస్సుకు నాలుగు వైపుల నలుగురు ముట్టించారు.

బస్సు కాలుతూ ఉంది.

మంటలు లేస్తున్నాయి.

"మా పార్టీ ఎమ్మెల్యేని ఘెరావ్ చేయించిన ఆ పార్టీ ఎం.పి.డౌన్. డౌన్!! ఆ ఎం.పి ని వెంటనే అరెస్టు చేయాలి." నినాదాలు మంటలతో పోటీపడుతున్నాయి.

బస్సు కాలుతూ ఉంది. ఒక పార్టీ ఎమ్మెల్యేని మరొక పార్టీ ఎం.పి. ఘెరావ్ చేయించి నందుకు నిరసనగా!...ఆ ఎమ్మెల్యే సానుభూతి పరుల ప్రదర్శనగా!!

ఏమిటీ మనస్తత్వం?

ఈ మనస్తత్వం ఇలా మూడుపూటలూ మితిమీరి తింటున్నవాడి కొవ్వులా నానాటికి పెరిగిపోతూ ఉంటే- భారతంమిట్టలు బస్సులే కాదు ఊళ్ళకుఊళ్ళే కాలిబూడిద కావలసిందేనా?

ఎమ్మెల్యేని ఘెరావ్ చేయించిన ఎం.పి. మీద కసి తీర్చుకొంటునట్లుగా యువతరం బస్సు మీద పెట్రోల్, కిరసనాయిలు చల్లుతూ ఉంది.

మంటలు పైకి లేస్తున్నాయి- వాళ్ళ ఆనందానికి ప్రతీకలుగా.

చెవులు చిల్లులు పడేటట్లు ఒక టైరు 'ఢాం' అని పగిలింది.

ఒక వికటాట్టహాసం! అదుపు తప్పుతున్న సమస్యా పరిష్కారం ఒక రచయితను సవాలు చేస్తున్నట్లుగా! గమ్యం చేరలేకుండా నిలబడి ఒకరి మొగం ఒకరు చూసుకొంటున్న ప్రయాణికులను పరిహసిస్తున్నట్లుగా!!... ●

ఇండియాటుడే
(6, ఏప్రిల్ 1997)